క్లుప్తంగా

నేడు రైతు సమస్యలపై ర్యాలీ



టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆదివారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు మొదలుకొని ఎరువులు, సాగు నీరు అందజేయడంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. అంతేకాకుండా అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి కంటి తుడుపు చర్య చేశారని మండిపడ్డారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై టెక్కలిలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్న ర్యాలీకు పార్టీ నాయకులతో పాటు రైతులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న మహాలక్ష్మి

సోంపేట: పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు, శానిటేషన్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ కోరారు. సోంపేటలో వంట, శానిటేషన్ కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 25 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను రాజకీయం పేరుతో తొలగించడం దారుణం అన్నారు. ఏడేళ్లుగా శానిటేషన్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారికి పనికి తగ్గ వేతనం అందజేయాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్‌లో నిర్వహిస్తున్న జిల్లా మహాసభలను కార్మిక సంఘాల ప్రతినిధులు విజయవంతం చేయాలన్నారు. సంఘ ప్రతినిధులు కౌసల్య, శ్యామల ఉన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ అన్నారు. మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నారీశక్తి యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఎం.తోటూరు గ్రామంలో మహిళల హక్కులు, వారి రక్షణపై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళలు తమకు కీడు కలుగుతుందన్న ఆలోచన వస్తే వెంటనే 112, 1930, 1098 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



పరామర్శలో ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని జె.బెల్లుపడ పంచాయతీ పరిధి భిన్నలకొత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇప్పిలి లచ్చయ్య కుమారుడు జగదీష్ ఇటీవల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు లద్దు కేశవపాత్రో, కొణపల సురేష్, తలగాన తిరుపతిరావు, కప్పల యుగంధర్, మెండా ప్రకాశ్‌రావు ఉన్నారు.

ఘనంగా రోటరీ మాసోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీక్లబ్ మాసోత్సవాలను ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. స్థానిక రోటరీఫంక్షన్ హాల్లో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాసోత్సవాల సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన రోటరీక్లబ్ అధ్యక్షులు మోహన్‌వెంకటేష్, కార్యదర్శి రామకోటిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి పి.పరేష్ కుమార్, సీఐ మీసాల చిన్నంనాయుడు, రోటరీగవర్నర్ కల్యాణ్ చక్రవర్తి, బాబీ, సారథి, డాక్టర్ మోహన్‌రాఖో, డాక్టర్ త్రినాథరెడ్డి, జోహెర్‌ఖాన్, కృష్ణమూర్తిరెడ్డి, వి.సురేష్, రాజ్‌కుమార్, షణ్ముఖ్, రామారావు, తులసీదాస్, ప్రదీప్, ప్రఫుల్‌పండా, జయదేవ్ పాల్గొన్నారు.

వామ్మో వానరాలు..!

- ఇచ్ఛాపురం పట్టణ వాసులను వణికిస్తున్న కోతులు
- గుంపులుగా సంచరిస్తున్న వైనం
- దాడి చేస్తుండడంతో భయపడుతున్న ప్రజలు



రోడ్డు మధ్యలో తిష్ట వేసిన కోతులు

ఇచ్ఛాపురం: అటవీ ప్రాంతంలో ఉండాల్సిన వానరాలు జనారణ్యంలోకి ప్రవేశించాయి. దీంతో జనం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోకి ఎన్నడూ లేనివిధంగా కోతులు ప్రవేశించాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. విధుల్లోకి వచ్చిన కోతుల మూకలు ఇళ్లలోకి చొరబడి కనిపించిన వస్తువులను తీసుకొని వెళ్లిపోతున్నాయి. సామాన్లను చిందరవందర చేస్తున్నాయి. వాటిని తరిమేందుకు వెళ్లే వారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. ఎవరైనా బజారు నుంచి సరుకులను కొనుగోలు చేసుకొని సంచులతో తీసుకొచ్చే సమయంలో ఒక్కసారిగా మీదపడి దాడిచేస్తూ బ్యాగులాక్కొని వెళ్లిపోతున్నాయి. వాహనాలాపై వెళ్లేవారిపై సైతం దాడి చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

వణికిపోతున్న చిన్నారులు

కోతుల కారణంగా పాఠశాలలకు వెళ్లేందుకు చిన్నారులు వణికిపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు దేవాలయాలకు వెళ్లేటప్పుడు వారిపై దాడులకు పాల్పడి చేతులో ఉన్నవాటిని లాక్కొని పోతున్నాయి. ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో వందల సంఖ్యలో కోతులు రోడ్లపై గుంపులుగా సంచరిస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఒంటరిగా బయటికి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. వానరాల దాడుల్లో గత వారం రోజుల్లో 15 మంది గాయపడ్డారు. ప్రధానంగా డైలీమార్కెట్, మెయిన్‌రోడ్, కార్జీవీధి, దానంపేట, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, బంగ్లారోడ్డు, బస్టాండ్ కూడలిలో గుంపులుగా సంచరిస్తున్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో కోతులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేయడంతో గాయాలపాలవుతున్నారు. జనాలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్న కోతుల నియంత్రణలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా చొరవ తీసుకొని నియంత్రణ చర్యలపై దృష్టిసారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మెయిన్‌రోడ్డులోని డివైడర్‌పై సంచరిస్తున్న వానరాలు

మీదపడి కరుస్తున్నాయి..



పట్టణంలో కోతులు బెడద ఎక్కువగా ఉంది. ఏ మూల నుంచి వచ్చి దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. ఇళ్లలోకి చొరబడి సామాన్లను చిందర వందర చేస్తున్నాయి. మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకొని వెళ్లడానికి భయంగా ఉంది. కోతుల నివారణకు మున్సిపల్ అధికారులు తగుచర్యలు తీసుకోవాలి.

–బి.కేదారి,
కూరగాయల వ్యాపారి, ఇచ్ఛాపురం

వ్యాపారాలు చేసుకోలేక పోతున్నాము..



రోజంతా కష్టపడి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొంటే మూడు వందల నుంచి నాలుగు వందలు వస్తాయి. కోతులు ఒక్కసారిగా దుకాణాలపై పడి పండ్లు, ఇతర విలువైన వాటిని ఎత్తుకెళ్లిపోతున్నాయి. ఆ రోజు మా కష్టం వృథా అవుతుంది. దుకాణాల వద్ద గుంపులు గుంపులుగా ఉండడం వల్ల వ్యాపారాలు సక్రమంగా చేసుకోలేకపోతున్నాం. వీటి నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

–దేవేంద్ర మహంతి,
పండ్లవ్యాపారి, ఇచ్ఛాపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఇచ్ఛాపురం పట్టణంలో పెరిగిన కోతులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్య గురించి మున్సిపల్ ఉన్నతాధికారులకు, ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మున్సిపాలిటీలో ఇటీవల పెరిగిన వీధి కుక్కల నివారణతో పాటు వాటి సంతతి పెరగకుండా ఉండేందుకు వాటికి ఆపరేషన్లు చేయించాము. అలాగే కోతుల నివారణకు ఉన్నతాధికారుల సూచనల మేరకు తగుచర్యలు తీసుకుంటాం.

–ఎస్.రమేష్,
మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

వాన కురిసింది..నేల మురిసింది..



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో కురుస్తున్న వర్షం



ఇచ్ఛాపురం రూరల్: కేధారిపురం ప్రాంతంలోని పంట పొలాల్లో చేరిన వర్షం నీరు

ఇచ్ఛాపురం రూరల్

నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో నారుమడులు ఎండిపోతున్న దశలో కురిసిన వర్షం రైతులకు ఉపశమనం కల్పించింది. ఆదివారం ఉదయం నుంచి ఆడపా దడపా కురుస్తున్న వర్షానికి పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దమ్ములు, దుక్కులు, నాట్లు పనుల్లో వ్యవసాయ కూలీలు బిజీబిజీగా గడిపారు.

సోంపేట: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎండిపోతున్న వరినారు మడులకు ఊపిరి రావడంతో పాటు ఖరీఫ్ వరి సాగుపనులు ముందుకు సాగాయని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో వరి సాగు లక్ష్యం తొమ్మిది వేల ఎకరాలు కాగా ఇప్పటికి 3194 ఎకరాలు మాత్రమే వరినాట్లు పడ్డాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరో 2,300 ఎకరాలు వరి నాట్లు పడే అవకాశం ఉందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.



సోంపేట: బేసిరామచంద్రాపురంలో వరినాట్లు వేస్తున్న రైతులు

వచ్చేనెల ఒకటిన పెన్షన్ మార్చ్



కంచరాన చిన్నబాబు

పలాస: రాష్ట్రంలోని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న పోరుబాటను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ వింగ్ పలాస నియోజకవర్గం అధ్యక్షుడు కంచరాన చిన్నబాబు కోరారు. సెప్టెంబర్ ఒకటో తేదీన జరగనున్న పెన్షన్ మార్చ్‌కి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ మేరకు పలాసలో ఆదివారం ఆయన మాట్లాడారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు పెన్షన్ మార్చ్ పేరిట జరుగునున్న కార్యక్రమంలో ప్రతిఒక్కరు నల్లచొక్కాలు ధరించి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు సీపీఎస్, జీపీఎస్ కంటే మెరుగైన పింఛన్ విధానం తీసుకొస్తామని హామీ ఇచ్చారని.. వాటిని నిలబెట్టుకోవాలన్నారు. ఉద్యోగులకు రావలసిన డీఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, సరెండర్ లీవ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. పీ–4 పథకాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దరాదన్నారు. అర్హత ఉన్నత వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

కొనుగోలు చేశారు వినియోగం మరిచారు!

- సంపద కేంద్రంలో మూలుగుతున్న చెత్త బుట్టలు, రిక్షాలు



చెత్త సంపద కేంద్రంలో మూలుగుతున్న చెత్త బుట్టలు

టెక్కలి:

టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ ప్రజలకు పెద్ద తలనొప్పిగా మారింది. రోజు రోజుకూ పెరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు, జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో చెత్త సమస్య వేధిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు తమవంత ప్రయత్నం చేశారు. పారిశుద్ధ్య నిర్వాహణలో భాగంగా చెత్త సేకరణ కోసం రెండు నెలల క్రితం పంచాయతీ నిధులతో చెత్త బుట్టలు, చెత్త సేకరణ రిక్షాలు కొనుగోలు చేశారు. అయితే వాటిని వినియోగించకుండా వదిలేశారు. ప్రస్తుతం తెంబూరు రోడ్‌లోని చెత్త సంపద కేంద్రంలో అవి మూలుగుతున్నాయి. వీటిని వినియోగించకపోవడంపై స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్త సంపద కేంద్రంలో ఆరుబయటే చెత్త బుట్టలు, రిక్షాలు వదిలేయడంతో అవి ఎండకు ఎండుతూ వానకూ తడుస్తూ పాడవుతున్నాయి. మేజర్ పంచాయతీలోని 20 వార్డుల పరిధిలో 150కు పైగా ఉన్న వీధుల్లో చెత్త సేకరణ లక్షలాది రూపాయలు వెచ్చించి 25 బుట్టలు, 40 రిక్షాలు కొనుగోలు చేశారు. వాటిని తెంబూరు రోడ్‌లో గల చెత్త సంపద కేంద్రంలో ఉంచారు. అయితే నెలల గడుస్తున్నప్పటికీ వాటిని వీధుల్లో ఏర్పాటు చేయలేదు. పట్టణంలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభా దృష్ట్యా చెత్త సమస్య పెద్ద టాస్క్‌గా మారింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధుల్లో చెత్త బుట్టలు, సేకరణ రిక్షాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఆరుబయటే వదిలేసిన చెత్త సేకరణ రిక్షాలు

కాలయాపన చేస్తున్నారు...



మేజర్ పంచాయతీలో చెత్త సేకరణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్త బుట్టలు, సేకరణ రిక్షాలు కొనుగోలు చేశారు. అయితే వాటిని వినియోగించకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీలో పలు వీధుల్లో చెత్త సమస్య ప్రజల్ని వేధిస్తోంది. ఇటువంటి సమయంలో వీటిని తక్షణమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

–డి.ధర్మారావు,
వార్డు సభ్యుడు, టెక్కలి మేజర్ పంచాయతీ

ప్రత్యేక ప్రణాళిక



టెక్కలి మేజర్ పంచాయతీలో చెత్త సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. మరో 25 చెత్త బుట్టలను కొనుగోలు చేసి ఇప్పటికే గుర్తించిన వీధుల్లో వాటిని ఏర్పాటు చేస్తాం. అంతేకాకుండా ప్రతీ మూడు వీధులకు ఒక చెత్త సేకరణ రిక్షాను ఏర్పాటు చేసి చెత్త సమస్య లేకుండా చేస్తాం. ప్రజల సహకారంతో ప్రణాళికకు అనుగుణంగా త్వరితగతిన చెత్త బుట్టలు, చెత్త సేకరణ రిక్షాలను వినియోగిస్తాం.

–ఎ.వి.శ్రీనివాస్,
పంచాయతీ కార్యనిర్వాహణాధికారి, టెక్కలి



కాలువలో పేరుకుపోయిన చెత్త

భక్తిశ్రద్ధలతో సంక్రమణం పూజలు





ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం, బలరామపేట కాళీ మాత ఆలయంలో సంక్రమణం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సింహ సంక్రమణాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా కాళీమాత ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. –ఇచ్ఛాపురం

ఉద్యోగులకు సన్మానం



కంచిలి మండలంలో కేసరపడ సచివాలయంలో పనిచేసి ఇటీవల వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను స్థానికులు, సహోద్యోగులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ బొడ్డ చరణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జగదీష్, ఎక్కల పంచాయతీ కార్యదర్శి పిలక విశ్వనాథం, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరావు ఉన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు, కప్పల యుగంధర్, మెండ ప్రకాశ్, రంగాల శ్రీనివాస్, టీడీపీ నాయకులు గొరిబిడ్డి మన్మథరావు, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు బుడ్డెపు కామేష్‌రెడ్డి ఉన్నారు. –కంచిలి

మీనామృతంతో ప్రయోజనం



సేంద్రియ వ్యవసాయ సాగు విధానంలో మీనామృతంతో రైతులకు మంచి ప్రయోజనం కలుగుతుందని కంచిలి మండల యాంకర్ టి.శివానందం అన్నారు. చిన్నకొజ్జిరియా పంచాయతీ పరిధి చంద్రుపుట్టుగ గ్రామంలో మీనామృతం తయారీ విధానాన్ని ఆదివారం ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. దీని తయారీ విధానంలో వాడాల్సిన పదార్థాలు, తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ మానీ, లీడ్ ఫార్మర్స్ పాల్గొన్నారు. –కంచిలి

రెండు రోజుల్లో జగన్నాథ సాగరానికి వంశధార'

- వంశధార ప్రాజెక్టు ఈఈ బి.శేఖర్‌రావు



హరిదాసుపురం వద్ద గుర్రపుడెక్క తొలగించే పనులను పరిశీలిస్తున్న ఈఈ శేఖర్‌రావు

వజ్రపుకొత్తూరు: పలాస శివారు ప్రాంతమైన జగన్నాథసాగరానికి రెండు రోజుల్లో వంశధార జలాలు అందించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నామని వంశధార ప్రాజెక్టు టెక్కలి ఈఈ బి.శేఖర్‌రావు అన్నారు. ఆదివారం వంశధార ప్రధాన ఎడమ కాలువ 85.3 కిలోమీటర్ల హరిదాసుపురం వద్ద పేరుకు పోయిన గుర్రపు డెక్కను తొలగించే పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు నందిగాం మండలం గొల్లూరు నుంచి హరిదాసుపురం వరకు ఉన్న నీటి సరఫరాకు ఉన్న అంతరాలను పొక్లయినర్‌తో తొలగిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో దాదాపు 23 పైప్‌లు ఎడమ కాలువ దిగువ భాగంలో అక్రమంగా ఉండడం, ఎగువ ప్రాంతంలోని చిన్న తామారాపల్లి, మాలపేట, బెజ్జిపల్లి తదితర ప్రాంతాల్లో 62 మోటార్ ఇంజిన్లు ఏర్పాటు చేయడంతో 300 క్యూసెక్కుల సాగు నీరు ప్రవాహం కాలువలో తగ్గుతోందన్నారు. దీంతో శివారుకు సాగునీరు అందడంలో ఇబ్బంది జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవరం లేదని కాలువలో నీటి ప్రవాహం పెరిగిందన్నారు. మరో రెండు రోజుల్లో పలాసతో పాటు వజ్రపుకొత్తూరు మండలానికి సాగునీరు పుష్కలంగా అందుతోందన్నారు. కార్యక్రమంలో వంశధార ఏఈఈ తమ్మినాన రాజశేఖర్ బాబు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ జి.నిరంజన్, రైతు సంఘం నాయకులు ఎ.షణ్ముఖరావు, సుధాకర్, కుమారస్వామి, జి.వెంకటరమణ, వి.భుజంగరావు ఉన్నారు.

మూడు వాహనాలు ఢీ



బస్సును ఢీకున్న బొలేరో వాహనం

టెక్కలి రూరల్: మండలంలోని విక్రాంపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వరుసగా మూడు వాహనాలు ఢీకున్నాయి. టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును విక్రాంపురం సమీపంలో ఒక్కసారిగా ఆపడంతో వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం దాన్ని ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు బొలేరోను ఢీకొట్టింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. బొలేరోతో పాటు కారు ముందుభాగం నుజ్జయింది. కాగా వరుసగా మూడు వాహనాలు ఢీకొట్టడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను సరిచేశారు. ప్రమాద వివరాలు సేకరించారు.

మొక్కలు నాటివేత



మొక్కలు నాటుతున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించి భావితరాల వారికి కానుకగా అందిద్దామని నేషనల్ యూత్ వలంటీర్ హంగీర్ బెహరా అన్నారు. మేరా యువభారత్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'ఏక్ పెడ్ మా కె నామ్'కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఈదుపురంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవకోటికి ప్రాణాధారమైన చెట్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరికీ ఉందన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ సొసైటీ పూర్వ అధ్యక్షుడు రామచంద్ర బెహరా, పాల్, యాంగిచ్, ఖగేశ్వర్, బాసుదేవ్, రవీంద్ర బెహరా, వర్మ, బెహరావీధి యువకులు పాల్గొన్నారు.

బీమా పత్రాలు అందజేత

పలాస: పలాస ప్రెస్ క్లబ్ సభ్యులకు బీమా పత్రాలను ఆదివారం అందజేశారు. ప్రెస్‌క్లబ్ రిజిస్ట్రేషన్‌తో పాటు క్లబ్‌లో సభ్యులందరి పేరున రూ.10 లక్షలు కవరు చేసే బీమాను చేసి వారికి ఆ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధి చెరుకుపల్లి నేతాజీ, సంపత రావు జయంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.